# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్రంలో మాదకద్రవ్యాల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

❖ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

❖ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 135వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

==========================

డ్రగ్స్‌పై పోరాటం అంటే యువత భవిష్యత్‌ను కాపాడటమే అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి తన సందేశాన్ని అందిస్తూ... రాష్ట్రంలో మాదక ద్రవ్యాల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, డ్రగ్స్ అక్రమ రవాణాదారులను చట్టం ముందు నిలబెడతామని అన్నారు. డ్రగ్స్ మహమ్మారి బారినపడ్డ వారికి అన్ని విధాలా సహాయం అందించి సాధారణ జీవితంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల రవాణపై జీరో టాలరెన్స్ విధానంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని, ప్రతి కుటుంబానికి సురక్షిత భవిష్యత్ అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. “డ్రగ్స్ వద్దు బ్రో” ప్రచారానికి ప్రజలంతా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు.

==========================

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ,

దోమల నియంత్రణ చర్యలపై ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజ ఇతర ఉన్నతాధికారులతో ఈరోజు అమరావతిలో ఉప ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని.. అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని, 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. దోమలు పెరిగితే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని.. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

==========================

మొహర్రం.. త్యాగానికి, సత్యానికి గుర్తుగా నిలుస్తుందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం కోనేరు సెంటర్ లో మొహర్రం పండుగ సందర్భంగా ఈరోజు ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ EAGLE (Elite Anti- Narcotics Group for Law Enforcement) పోలీసు విభాగం సమర్ధవంతంగా పని చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ చెప్పారు. ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృశ్య మాధ్యమ విధానంలో సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ... గతంలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం గంజాయి రవాణాకు అనుకూలంగా పేరుపొందిందని, నేడు ఆంధ్రప్రదేశ్ మాదకద్రవ్యాల నియంత్రణలో జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఈగల్ ప్రధాన కార్యాలయం రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని ఆయన తెలిపారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు అందరూ సహకారం అందించాలని హోం మంత్రి వంగలపూడి అనిత కోరారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈరోజు నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కీ పెహచాన్" కార్యక్రమంలో హోం మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని మంత్రి పిలుపునిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

విరామం

==========================

రాష్ట్రంలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఆర్టీజీఎస్‌పై మంత్రి లోకేశ్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల ప్రగతిపై ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ శాఖల సమాచారాన్ని క్రోడీకరించేందుకు చేపట్టిన డేటాలేక్ పనులను జూలై నాటికి పూర్తి

కావాలని ఆదేశించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలన్నారు. రేషన్ కార్డుల విభజన, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం, తొలగించే ప్రక్రియను మరింత సులభతరం చేయాలని సూచించారు.

==========================

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శాసన సభ్యులు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలిత కుమారిలతో కలిసి మంత్రి ఈరోజు ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రజల నుండి వినతులను స్వీకరించారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ.. ప్రజా రంజకంగా పాలన కొనసాగిస్తున్నదని తెలిపారు.

==========================

పశ్చిమ గోదావరి జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం జిల్లా అంతటా కొనసాగుతోందని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. తాడేపల్లిగూడెంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆమె ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 18 ఏళ్ల వయసు నిండిన వారిని ఓటర్ల జాబితాలో చేర్చడంతో పాటు అర్హులైన వారందరినీ ఓటర్ల జాబితాలో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు కట్టుబడి ఉన్నామని కలెక్టర్ పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 135వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్, News on air మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెళ్లలో కూడా ఇది ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే… ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

==========================

ఆగ్నేయ మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం.. ఈరోజు ఉత్తర తెలంగాణ దాని పరిసర ప్రాంతాలపై సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో కొన్నిచోట్ల ఈరోజు, రేపు తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ శాఖ అధికారి వెంకట్రావు తెలియజేస్తూ…

(వాయిస్ 25 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ పి. శ్యామ్ నవీన్ కుమార్ కోరారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా దేవగుప్తంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆవరణలో ఈరోజు జరిగిన క్రెడిట్ ఔట్రీచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

==========================

==========================